# వయసు వరదలు

శ్రీహరి చనిపోయాడు. ఈ వార్త విని ఒక కన్నీటిచుక్క అప్రయత్నంగా వదిలాను.

శ్రీహరి మా ఆఫీసులో ప్రవేశించి అప్పుడే వారం రోజులు కావచ్చింది. టైముకు రావడం, తన కాగితాలు చూచుకోవడం, ఆఫీసుకాలం పూర్తి అవగానే యింటికి పోవడం అతనికి పరిపాటి అయిపోయింది. కాని ఆఫీసులోని వారెవరితోను ఎక్కువగా పరిచయంగా మాట్లాడలేదు.

ఒకరోజు అతను ఆఫీసు వదలి ఒంటరిగా వెళ్ళిపోతూంటే నేనే అతన్ని పలకరించాను. అతను స్నేహపూర్వకంగా ఒక చిరునవ్వు నవ్వాడు.

శ్రీహరి స్వతహాగా ఒంటరితనాన్ని అపేక్షించేవాడు. చాలా కట్టుబాట్లతో జీవితాన్ని గడిపేవాడు. సాయంత్రం అవగానే దండీలు, బస్కీలు మొదలైన వ్యాయామం చేసేవాడు. అతని కండలు తిరిగిన పచ్చని అందమైన శరీరం విశాలమైన నుదురు, ఎర్రటి పెదాలు చూస్తూంటే, ఆడవాళ్ళ సంగతి అటుంచి మొగవాళ్ళకే చాలా జగన్మోహనంగా కనుపిస్తాడు.

అతని మంచి ప్రవర్తనే నన్ను అతనికి సన్నిహితంగా తీసుకెళ్ళి, అతని స్నేహితునిగా చేసింది. క్రమంగా మా స్నేహం పెరిగింది.

ఒకరోజు యిద్దరం సినిమాకు వెళ్ళాం.

అందులోని కథ ఒక ప్రేమఘట్టం. అందులోని నాయికా నాయకులు, చిన్నప్పుడు ప్రేమించుకుని, తరువాత చాలా కష్టాలుపడి విరహవేదనచే పరితపించి చివరకు పెండ్లి చేసుకుని సుఖంగా వున్నారు.

"ఎలా వుంది సినిమా!" అన్నాను మామూలు ధోరణిలో.

'ఏడ్సినట్లుగా వుంది' అన్నాడు శ్రీహరి చిరాకుగా.

నేనే శ్రీహరిని బలవంతంగా తీసుకువెళ్ళాను సినీమాకు. రానంటుంటే బలవంతంగా చూడడంవల్ల సినీమా అతనికి బాగులేదేమో అనుకున్నాను. నామట్టుకు, పాత్రలు చక్కగా పోషింపబడ్డాయి. సంగీతం చాలా బాగుంది. అందులోని ప్రేమఘట్టాలు, నా జీవితంలోని కొన్ని సంఘటనలు జ్ఞప్తికి తెచ్చాయి. నేను నిజంగా ఎంతో ఆనందం అనుభవించాను.

"ఏం అలా అన్నావు" అన్నాను శ్రీహరితో.

"ఏ కథ చూసినా యీ ప్రేమ, విరహం లేకుండా మనవాళ్ళు సినిమా తీయలేరనుకుంటాను"

"కథ ప్రేమసంబంధమైనందుకు మనం దూషించ కూడదు. తీసుకున్న యితివృత్తం ఎంత వాస్తవికతతో చిత్రించారో అది మనం గమనించాలి."

"స్త్రీ పురుషుల మధ్య ప్రేమతప్ప మరేవిధమైన సమస్యలూ ప్రపంచంలో లేవా? జంతువులకన్న కనికష్టమై పోయారు నేటికాలపు మనుష్యులు"

"స్త్రీ పురుషులమధ్య అనురాగం ప్రేమజీవితాలను ఉదృష్టదశకు తెస్తాయి. అవి తిన్నగా లేకపోతే జీవితాలు నశిస్తాయి. యితర సమస్యలు ఏవీ యీ ప్రేమసమస్యలతో తులతూగలేవు.

'క్షమించు, నేను నీతో ఏకీభవించలేను' అని ముభావంగా ముందుకు నడిచాడు శ్రీహరి.

" ఎందుచేత " అన్నాను.

"నాకు స్త్రీలంటే ఏమీ గౌరవం లేదు. అందుచేత జీవితంలో వాళ్ళకు ప్రాముఖ్యత యివ్వకూడదు."

"స్త్రీలకు ప్రాముఖ్యతను నీ అంతట నువ్వు యివ్వనక్కర లేదు. యివ్వలేవు కూడ. ప్రకృతిలోని వారిస్థానాన్ని అనుసరించి వారే ఆ ప్రాముఖ్యత సంపాదించుకుంటారు."

"పురుషుడి దౌర్బల్యానికి అది ఒక చిహ్నమన్నమాట."

"ప్రతీ పురుషుడిలో ఆ దౌర్బల్యం వుంది."

" నేను నమ్మను "

" పరిస్థితులే నమ్మిస్తాయి "

" చూద్దాం "

అంతటితో మా సంభాషణ అంతమయింది.

కాని నాకు నిజంగా ఆశ్చర్యమే. పాతికేండ్లు దాటిన మనిషి స్త్రీచింత లేకుండా కట్టుబాట్ల జీవితంతో సంతోషంగా వున్నాడంటే నిజంగా చిత్రమే. అటువంటి స్వభావం నా ముప్ఫయిఏండ్ల జీవితంలో యిప్పటివరకు చూడలేదు. నాకు స్త్రీసాంగత్యం పదహారు ఏటనుంచే లభించింది. స్త్రీతత్వాన్ని,

ప్రపంచంలో స్త్రీ స్థానాన్ని నిజంగా బాగా తర్కించి అర్థం చేసుకున్నానని నా విశ్వాసం. అందుచేత నా భావాలతో శ్రీహరి ఏకీభవించలేకపోవడం నాకు కొంచెం విచిత్రంగానే తోచింది.

ఉద్రిక్తమైన మనస్సులతో సినిమా సంగతి మరచి యింటికి పోయాము.

ఆ ఆఫీసులోనే రెండు సంవత్సరాలు గడిచాయి. శ్రీహరి ప్రవర్తనలో ఏ మార్పులేదు. పెండ్లి చేసుకోలేదు. కారణం తనకి స్త్రీ అవసరం లేదన్నాడు.

సంతోషం, సంతృప్తి, హృదయంలో పెంచుకుని, చక్కటి వ్యాయామం చేస్తూ మానసికంగా, శరీరకంగా కూడ, అతను అందంగా ఆనందంగా వుండడం, నిత్యమూ ఏవో స్త్రీ సమస్యలు వేధించి పీల్చుకు తింటున్న నాకు ఒక విధమైన అసూయను కలిగించింది.

నిజంగా నా అసూయ దృష్టి అతనికి తగిలిందను కుంటాను.

కొన్నాళ్ళ తరువాత శ్రీహరి చిక్కిపోసాగాడు. మనస్సులో ఏదో బాధ పడుతుండడం బాగా గమనించాను. తరుచు మనోవ్యాకులత గురించి మరిచిపోడానికి ఆఫీసులో అందరితోటీ ఏవో విషయాలు గురించి మాట్లాడుతూ వుండే వాడు. మునుపు ఒంటరిగా, సంతోషంగా గడిపేమనిషి, స్నేహితులమధ్య ఉండకుండా ఒక్క నిమిషం గడిపేవాడు కాదు. ఒకవేళ ఒంటరిగా కూర్చుంటే తలమీద చేతులు పెట్టుకుని నిట్టూర్పులు విడిచేవాడు.

ఒకరోజు అతన్ని ప్రశ్నించాను "సంగతేమిటి, అలా వున్నావు అని." "ఏమీలేదు" అంటూ శ్రీహరి నన్ను తప్పించుకుపోయాడు.

రోజులు గడుస్తూంటే అతని శరీరం బక్కపల్చగా తయారయింది. ముఖంలోని పచ్చని వర్చస్సుపోయి క్రమంగా నల్లబడింది. ఎర్రటి అతని పెదాలు, కమిలి తుప్పుపట్టినట్లు తయారయేయి.

ఒకరోజు వార్తలు విందామని పార్కుకు వెళ్ళాను. రేడియో వాగుతూంటే, శ్రీహరి ఆ పార్కులో ఒకమూల కూర్చుని చేతిలో గులకరాళ్ళు ఏరుతూ, అర్ధంలేకుండా ఒక్కొక్కటి దూరంగా మెల్లిగా విసురుతున్నాడు. అతని పరిస్థితి చూడగానే ఏదో భరింపలేని మనోవ్యాకులత అతన్ని వేధించుకు తింటున్నట్టుగా గోచరించింది.

వెనకాలవెళ్ళి అతని ఒంటిమీద చెయ్యివేశాను. శ్రీహరి ముఖం నావైపు త్రిప్పి నన్నుచూసి తిరిగి తలవంచుకున్నాడు.

"శ్రీహరి ఎందుకు అలా వున్నావు" నీకేమైనా కష్టాలు కలిగితే నాతో చెప్పు. నాకు తోచిన సహాయం చేస్తాను." శ్రీహరి వెక్కి వెక్కి ఏడ్చాడు. నాకు అతని ఆకస్మిక రోదనం చాలా ఆశ్చర్యం కలిగించింది.

కళ్ళు తుడుచుకుని బాధ దిగమింగి, శ్రీహరి చెప్పడం మొదలు పెట్టాడు.

ఏడాదిక్రితం మా యింటిప్రక్కకు ఒక క్షత్రియ కుటుంబం కాపురం వచ్చింది. భార్యాభర్తలు, ఒక ఐదేండ్ల కుర్రవాడు. అంతే ఆ కుటుంబం. చాలా ధనికులు. మా యింట్లో వాళ్ళందరితోటీ చాలా స్నేహం పెంపొందించుకుంది, ఆ యింటావిడ. నేను మాత్రం ఆమెతో నా సహజ ముభావంతో మాట్లాడకుండా వుండేవాణ్ణి. ఆమె ఎంతకాలంనుంచి నాకేసి చూస్తోందో నాకు తెలియదు. నాతో మాట్లాడాలన్నట్లు నేను మాయింట్లో ఎక్కడ మలిసితే అక్కడ ఆమె కనిపించేది. కాని నేను మాట్లాడే వాణ్ణికాదు. రోజులు గడిచిపోయాయి. మూడు నెలలక్రితం, తెల్లవారగట్ల లేచి, ఏదో అర్జంటుపని వుండడంవల్ల స్నానంచేసి బయటికి పోదామని, కుళాయిదగ్గరకు వెడుతున్నాను. ప్రక్కింటివారికి మాకు ఒకే కుళాయి. నేను కుళాయిదగ్గరకు వెళ్ళాలంటే ఒకగోడ మలుపుతిరగాలి. అలా తిరుగుతూంటే, ఆమె మాయింటివైపు వస్తూ చూడనట్లు నామీద పడిపోయింది. పడిపోయిన ఆమెను లేవదీసి, నేను కుళాయిదగ్గరకు వెళ్ళిపోయాను మాట్లాడకుండా. కాని నా హస్తాలతో తాకిన ఆమె మెత్తనిశరీరం నా మనస్సులో హత్తుకుని నిత్యం ఏవో కమ్మని తలపులు కలుగజేసేది. ఆమె కనుపించనప్పుడు చూడకుండా వుండలేకపోయేవాడిని. నేను చూస్తుంటే ఆమె మనసార కిలకిల నవ్వేది. చేతిలో ఏదైనా పుస్తకం కనిపిస్తే నా చేతులు ముట్టుకుంటూ పుస్తకం తీసుకునేది. ఇట్లా అనేక రసికసంఘటనలు జరిగాయి.

నా కోర్కెలు పెరిగాయి. నా మనస్సు, శరీరం, ఉద్రేకంతో నిత్యం సతమతమయ్యాయి. ఆమె నాకు చాలా చనువిచ్చింది. చనువు యిచ్చినకొద్దీ నా వుద్రేకం పెరిగేది.

కాని దగ్గరికి వెడితే "యిప్పుడు కాదు" అనేది. ఆ మాట నా హృదయాన్ని బ్రద్దలుకొట్టేది. కోపంవచ్చి నే మాట్లాడకపోతే తియ్యగా పలకరించేది. నా కోపం పోయేది. కాని తిరిగి అదే ప్రవర్తన.

నేను చేసిన యితర శృంగార సంఘటనలు, నా ఉద్రేకాల రెచ్చకొట్టున్నాయి నా జీవితంలో ఎప్పుడూ యింత ఆవేదన అనుభవించలేదు. నేను కనిపించగానే ఆమె చాలా అందంగా తయారవుతుంది. నేను ఆమెను చూస్తున్న కొద్దీ చాలా అందంగా కనుపిస్తుంది. ఆమెను నా మనస్సునుండి తప్పించడం చాలా కష్టంగా వుంది. తీరని కోరికలు నా గుండెను కలచి మరణవేదన యిస్తున్నాయి.

పూర్తిగా ఎండి పెళుసుగావున్న కట్టెకు నిప్పు అంటిస్తే మండకుండా ఎలా వుంటుంది? బాగా పరిపక్వమయి మిగల ముగ్గిన పండును పట్టుకుంటే పగలకుండా ఎలా వుంటుంది?

కన్నీరు వెలిగ్రక్కుతూ ముఖం వంచుకున్నాడు శ్రీహరి కథ ఆపి నేనంతా విన్నాను.

"స్త్రీని అసహ్యించుకునే నువ్వు. ఒక స్త్రీకోసం, అందులో పెండ్లిఅయిన పరస్త్రీకోసం పరితపిస్తున్నావంటే, నాకు చాలా ఆశ్చర్యంగా వుంది."

"నాకు ఆశ్చర్యంలేదు. ఎందుచేతంటే నేను నీభావాలకు దగ్గరగా వచ్చాను. కాదు పూర్తిగా విశ్వసిస్తున్నాను. ప్రకృతిలోని తమస్థానాన్నిబట్టి స్త్రీలే పురుషుని హృదయంలో ప్రాముఖ్యత సంపాదించుకుంటారు."

ఇంక అతనితో నేను తర్కించ దలుచుకోలేదు. యీ విషయంలో అతని బాధానివారణకు మార్గం వుపదేశించాలని నిశ్చయించుకున్నాను.

"శ్రీహరీ! నువ్వు వయస్సులో వున్నావు. మోహం పొందిన యౌవన మనస్సు పరవళ్లు త్రొక్కుతుంది. పెండ్లి చేసుకో నీబాధ తగ్గుతుంది" అన్నాను.

"పెండ్లి చేసుకుంటాను. కాని నేను ప్రేమిస్తున్న పరస్త్రీ కావాలి నాకు"

"ఆమె నీ భార్యగా లభ్యంకావడం చాలా కష్టం. అయినా నీ హృదయాన్ని నువ్వు తరచి చూచుకుంటే, అది నీ మోహం కాని, ప్రేమకాదు."

"నన్నెందుకు బాధపెడతావు నీ తర్కంతోటి? నన్ను ఒంటరిగా వుండనియ్యి!" అంటూ దూరంగా మరొక పూల మొకచువద్దకు పోయి కూర్చున్నాడు అతను.

నేను అతని అవస్థకు జాలిగాచూస్తూ అతని మనస్సు ఎట్లా మార్చాలని ఆలోచిస్తున్నాను.

ఇంతలో శ్రీహరిలేచి, పార్కుప్రక్క నున్న రోడ్డుమీదకు నడిచాడు. ఇంటికి వెళ్ళిపోతున్నాడనుకుని అతన్ని అనుసరిద్దామని నేను లేచాను.

కథా నిలయం

రోడ్డుమీద, మధ్యవయస్సులోని ఒక స్త్రీ ఒక చిన్న కుర్రవాడి చెయ్యిపుచ్చుకుని నడుస్తూంది. ఆమెకు ఎదురుగా శ్రీహరి వెళ్ళాడు. అతన్ని చూచి ఆమె ఆగింది, నవ్వింది.

నేను పార్కు ప్రాకారం దాటలేక వారు నుంచున్న చోట దగ్గరగా ఒక చెట్టు ప్రక్కన నుంచున్నాను.

తలలో మల్లిపూలు తురుముకుని, గులాబీరంగు చెమ్కీ పువ్వులచీర ధరించి, తాంబూలంతో పెదాలు ఎరుపు చేసుకుని ఒక చేత్తో చీరకొంగును విసరుకుంటూ సోయగంగా, అందాలు విరజిమ్ముతూ నిలుచుంది ఆమె.

"ఎక్కడికి వెడుతున్నారు" శ్రీహరి అడిగాడు ఆమెను.

"సినీమాకు, చిత్రాలో కొత్తసినీమా వచ్చింది".

"బాగుంది" నిట్టూర్పు విడిచాడు అతను.

"కోపం వచ్చిందా" ఓరగా నవ్వుతూ, కొంగుతో నవ్వు ఆపుకుంటూ అడిగింది ఆమె.

"లేదు" ముభావంగా సమాధాన మిచ్చాడు శ్రీహరి.

"ఇక్కడ పార్కులో కూర్చున్నారేం ?"

"ఏం చేస్తాను ! నా అనేవాళ్లు ఎవరూ లేకపోయాక".

"హుఁ" అంటూ ఆమె కొంటెగా వెక్కిరించింది".

"అబ్బ, చాలా బాధగా వుందండి."

"పాపం! "

"అవును, నాబాధ మీకేం తెలుసు" శ్రీహరి ఏడుపు ముఖం పెట్టాడు.

ఆమె లోపల నవ్వుకుని "అవ్వ! నడివీధిలో యీ గొడవ ఏమిటండి" అంటూ ముందడుగు వేసింది ఆమె.

శ్రీహరి ఆమెకు అడ్డంగా నుంచున్నాడు.

"రేపు"

"చూద్దాం"

ఆమె ముందుకు ఒక అడుగు వేసింది. ఆమె కంఠం నాకు చిరపరచితమైనట్లుగా వుంది. ముఖం ప్రక్కగా వుండడం వల్ల, ఆమెను గుర్తించలేక, ఎవరై వుంటారో చూద్దామని పార్కు గోడదాటి ఆమెకు ఎదురుగా వెళ్ళేను.

"మీరా?" అంటూ ఆశ్చర్యంతో, కంగారుతో, నాకేసి చూసింది.

"అవును" అంటూ నవ్వాను.

ఆమె ముఖం పాలిపోయింది. మునుపు కనిపించిన చలాకీ ఒయ్యారం తగ్గించింది. ముఖకళవళిక మార్చుకుంటూ "చాలా కాలానికి కనిపించేరు" అంది.

"మీరూ అంతే" అన్నాను.

"మీ అమ్మగారు చెల్లెళ్లు అంతా కులాసాగా వున్నారా?"

"అఁ"

"ఇప్పుడు ఎక్కడ వుంటున్నారు?"

"చార్ మినార్ దగ్గర"

"ఎప్పుడైనా మీ యింటికి రావాలండి"

"తప్పకుండా రండి"

"సినీమాకి వెడుతున్నాను, టైమయింది వస్తా" అంటూ నాకు ఒక నమస్కారంపెట్టి ఆమె ఆ పిల్లవాడితో ముందుకు సాగిపోయింది.

శ్రీహరి బాధలోని అంతరార్థం నాకు అర్థమయింది.

"నేను చెప్పిన స్త్రీ ఆమె" అన్నాడు శ్రీహరి.

"ఆ విషయం నాకు ఇందాకనే తెలిసింది."

"ఆమెను నువ్వు ఎలా ఎరుగుదువు ?

"తరువాత చెప్తా"

శ్రీహరి మనస్సు, కళ్ళు త్రెంపుకుని మోహంతో పరవళ్లు తొక్కుతోంది. నా సలహా అతను వినే పరిస్థితిలో లేదు. అందుచేత అతనిదగ్గర శెలవు తీసుకొని వెళ్ళిపోయాను.

రెండురోజులు పోయాక శ్రీహరి నాతో చెప్పాడు, ఆమె యిల్లు హటాత్తుగా ఖాళీచేసి వెళ్ళిపోయిందని, కాని నాకు ఆశ్చర్యం కలుగలేదు.

వారిద్దరిమధ్య జరిగిన వీడ్కోలు సంభాషణ శ్రీహరి నాతో చెప్పాడు.

"నేను మిమ్మల్ని మరిచిపోలేనండి. నా రాయిలాంటి హృదయాన్ని జాయిగా కదిలించి, ప్రేమపోసి, మరిగించి పోతున్నారు."

"నేను కూడ మిమ్మల్ని మరిచిపోలేనండి. నేను యిప్పటి వరకు పరపురుషుడిని కన్నెత్తి చూడలేదు మిమ్మల్నితప్ప. దైవం మనకు పరిస్థితులు అనుకూలం చెయ్యలేదు."

"మీరే అన్ని ఆటంకాలు కలుగజేశారు.

4357

"చెయ్యాలని చెయ్యలేదండి, నాకు భయం ఎక్కువ. ఏదైనా పైకి తెలుస్తే నా కాపురం చెడిపోదూ!"

"అవసరమైతే నే పెండ్లి చేసుకుంటాగా ?"

"ఒద్దండి. మీరు మగవాళ్లు, మీకు ఫరవాలేదు. నేను మొగమెత్తుకుని మళ్ళీ సంఘంలో తిరగాలా?"

"ఇంక ఇంతే అన్నమాట"

"ఏం చెయ్యను? ఆయన మరో మంచియిల్లు చూశారు, ఖాళీచెయ్యాలి. ఎప్పుడైనా కనుపిస్తే ఆనందంగా మాట్లాడుకుందాం."

"మీరు ఎక్కడున్నా నేను అక్కడకువచ్చి తీరుతాను"

"వద్దండి, అనుమానాలు పెరుగుతాయి."

ఇంతలో ఆమె భర్త తలుపు కొట్టడంవల్ల వారిద్దరు విడిపోయారు. ఆమె మర్నాడు ఖాళీ చేసింది యిల్లు.

ఇది అంతా విని సర్వం తెలిసిన జ్ఞానిలా ఒక్క నవ్వు నవ్వాను.

శ్రీహరికి ఆ నవ్వు వెగటుగా తోచింది. నా దగ్గరనుంచి వెళ్ళిపోబోయాడు.

"ఆమెను నువ్వు ఎలా ఎరుగుదువు అని నన్ను అడిగావు ఆనాడు పార్కులో. దానికి సమాధానం చెబుతాను రా" అని పిలిచాను శ్రీహరిని.

వచ్చి నా దగ్గర కూర్చున్నాడు అతను. నేను చెప్పాను. ఆమెను నేను బాగా ఎరుగుదును. ఆరు సంవత్సరాల క్రితం ఆమె నా యింటిప్రక్క కాపురముంది. అప్పటికి ఆమెకు

సంతానంలేదు. ఒంటరిగా వుండేది. నాకు యిరవైనాలుగేండ్లు. మంచి యౌవనంలో అందంగా వున్నాను. పెండ్లి కాలేదు. నీ విషయంలో చేసినట్టే ఆమె నా విషయంలోనూ చేసింది. నీకన్న ఎక్కువ బాధపడ్డాను. ఆమెను లేవదీసుకుపోయి పెండ్లి చేసుకోవాలనే ప్రయత్నం కూడ చేశాను. ఆమె నన్ను ఎంతో ప్రేమిస్తున్నట్టు నటించేది. కాని ప్రేమ కార్యరూపంలో చూపించేదికాదు.

ఆమెను బాగా పరీక్షించాను. కొన్నాళ్ళ తర్వాత నా మనస్సును నిగ్రహించుకున్నాను. ఉద్రేకాలకు తావివ్వలేదు. ఆమెకన్న ఎక్కువగా నటించాను. ఆమె జీవిత రహస్యం కనుక్కున్నాను.

శ్రీహరి నాకేసి ముఖం చిట్లించి చూశాడు.

"ఏమిటిది ?"

"ఆమె ప్రవర్తన అంతే"

"అంటే"

"పెండ్లికాని ప్రతీ బ్రహ్మచారితో అట్లా నటిస్తుంది"

"కారణం"

"వాళ్ళని ఏడిపించటానికి"

"ప్రయోజనం ?"

"మగవాళ్ళమీద కసి తీర్చుకోడానికి మనస్సుకు శాంతి చేకూర్చుకోడానికి"

"నాకు అర్థం కావడంలేదు ఆమాట"

"మా యిద్దరికి జరిగిన సంభాషణవింటే నీకే అర్థమవుతుంది." శ్రీహరిలాగే పరితపిస్తూ ఒక రోజు ఆఖరిసారిగా అడిగాను నేను, ఆమెను.

"నామీద మీకు అభిమానం వుందా లేదా ?"

"లేకపోతే మరి మీకోసం ఎందుకు యిలా పరితపిస్తాను"

"మరి నాకోర్కె..."

"అవకాశాలు లేవు"

"మీరే ఆటంకాలు పుట్టిస్తున్నారు"

"మగవాళ్ళని నమ్మడం కష్టం"

"నా విషయంలో మీరిలా అనుకోవద్దు"

"వారిస్వార్థంకోసం వారు ప్రాకులాడుతారు. ఇతరుల మనస్తత్వాలు పూర్తిగా అర్థం చేసుకోరు"

"మీ మాటల అర్థం ?"

"ఏమీలేదు. నా స్నేహితురాలికథ ఒకటి జ్ఞాపకం వస్తోంది. ఆమె చదువుకునే రోజుల్లో ఒకరిని ప్రేమించింది. అతనికోసం ఎంతో పరితపించి తన ప్రేమను అతని ఎదుట బాహాటంగా వెల్లడించింది. అతను చలించలేదు. ఎన్నో శృంగార చేష్టలతో అతన్ని కదుపదలచింది. అతను లెక్క చెయ్యలేదు. కోరివచ్చిన స్త్రీని తృణీకరిస్తే, ఆమె హృదయం ఎంత అగ్నిపర్వత మౌతుందో అనుభవంమీద కాని తెలియదు. ఆమెకు ఉక్రోషం పెరిగింది. గుండెబాధ భరించలేకపోయింది. కళ్ళుగప్పిన ఉన్మాది ఉక్రోషాలతో అతనిమీద కసి తీర్చుకోవాలని అతన్ని కత్తితో పొడిచేసింది. అతని రక్తం కళ్ళచూసి మతి చెడగొట్టుకుంది. వాళ్ళవూరిలో వీధుల్లో తిరుగుతోంది

పిచ్చిదిలా. ఎరిగిన కుటుంబాలు ఆమెను ఆదరిస్తాయి. ఎరగని వారు ఛీదరిస్తారు. ఏమయితేనేం? ఆమె జీవితంలో సుఖంలేదు. ఆమె జీవితం నాశనమయింది.

"ఆమె నా ఆప్త స్నేహితురాలు. ఆమె అవస్థ చూస్తుంటే యీ చలించని మగపురుషులను, కదిలించి పురుగులుగా చెయ్యాలని నాకు ఉద్రేకం వస్తుంది."

"నా విషయంలో మీరు అట్లా చేయదల్చుకున్నారా?" నవ్వుతూ అడిగాను.

"క్షమించండి. ఏదో ఉద్రేకంతో అన్నాను. మీ విషయంలో అలా ఎన్నటికి జరగదు. మిమ్మల్ని మనసారా అభిలషిస్తున్నాను." కంగారుపడుతూ, గబగబ వల్లించి, కన్నీరు కార్చింది.

"అనవసరంగా బాధపడకండి"

"ఆడదాన్ని కనుక తప్పనిసరిగా కాపురం నా నుదుట వ్రాశారు యిదే జీవితంలో సుఖం కాదండి. మగజాతిని నమ్మలేను, నమ్మటం కష్టం."

అంటూ ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమెను కొంతసేపు అనునయించాను. తరువాత ఒంటరితనంలోనే గుండె కుదుట బడవచ్చునని నేను ఆమెను విడిచి వచ్చేశాను.

ఇది విని శ్రీహరి అన్నాడు. "ఇది విన్నాకకూడ నాకేమీ అర్థం కాలేదు నీ మాటలు."

"నా వుద్దేశ్యం. అది ఆమె స్నేహితురాలి కథకాదు. స్వీయకథ. ఎలా గ్రహించానంటే ఆ కథ చెప్పడానికి ఆ పరిస్థితులలో అగత్యంలేదు. ఏదో వుద్రేకంలో ఆమె చెప్పింది."

"అయితే ప్రేమించినవాణ్ణ చంపిందంటావా?"

"చంపి వుండదు. చంపాలన్నంత వుక్రోషం రావడం మాత్రం నిజం."

"అయితే ఆమెకు పిచ్చిఎక్కి వీధిల్లో తిరుగుతోందా"

"పిచ్చి ఎక్కలేదు. పిచ్చి కలిగినంత బాధతో జీవితం గడుపుతోంది."

"ఇంతకీ నీవనేదేమిటి"

"ఇదే. ప్రేమించిన పురుషుడు ఆమెను తృణీకరించి, గుండెల్లో చిచ్చుపెట్టడంవల్ల ఆబాధ భరించలేక, ప్రేమ తెలియక, చలించని, కరగని, బ్రహ్మచారుల నందరినీ, కదలించి, ఉద్రేకాలు రెచ్చగొట్టి, బాధపెట్టి గుండెల్లో చిచ్చుపెట్టి క్రుంగదీయాలని ఆమె ప్రతిజ్ఞపట్టి వుండవచ్చు."

"ఇది నీ వూహాకల్పన. నిజం కాదు."

"ఇది నిజం. నీవు ఉద్రేకాలు మనస్సులో వుంచుకుని మాట్లాడుతున్నావు. నేను ఉద్రేకాలు ప్రక్కకు తొలగించి ఆమె తత్వాన్ని పరీక్షించ గలిగాను."

"నా మనస్సు మళ్ళించాలని వేసిన పాచికలా వుంది యీ కథ."

"ఉద్రేకాలు ఆవేశించినపుడు మనస్సుకు యుక్తాయుక్త విచక్షణజ్ఞానం వుండదు. నిజాలు అబద్ధాలుగా కనిపిస్తాయి. అబద్ధాలు నిజాలుగా మారిపోతాయి."

"నీవు ఏమన్నాసరే. నాకు ఆమె కావాలి. ఆమెను మరచిపోలేను."

బాధతో శ్రీహరి ఏడ్చాడు.

"రెచ్చగొట్టబడిన కామం తగ్గితే, మనస్సు కుదుట బడుతుంది. భోగంకొంపలకు పోరాదూ?"

"నాకు ఆ వాంఛ లేదు."

"డబ్బు ఖర్చు అని బెంగ కాబోలు"

"నాకసలు యిష్టం లేదు."

"రోగాలు వస్తాయని భయమా"

"నోరు సంభాళించుకో" కోపంతో అరిచాడు శ్రీహరి. శ్రీహరిమనస్సు తెలుకోడానికి భోగంకొంపలకు వెళ్ళమన్నాను కాని, అసలు వుద్దేశ్యం అదికాదు. అతనిదృష్టి అందుబాటులోని స్త్రీలమీదకు మారుతుందేమో అని పరీక్షించాను.

"పోనీ పెళ్ళిచేసుకో" అన్నాను.

"యీ పరిస్థితిలో పెళ్ళిచేసుకోలేను."

"ఆ రోజుల్లో నేను నీకన్న ఎక్కువ బాధపడ్డాను. ఆమెతత్వం పరీక్షించడానికి తాత్కాలికంగా ఉద్రేకాలు వుపశమింప చేసుకొన్నాను. కాని తర్వాత ఆ కోరికలు నాలో భరింపరాని బాధ కలుగజేశాయి. పెళ్ళి చేసుకొన్నాను. తర్వాత మనస్సుకు కొంతశాంతి కల్గింది. అందుచేత నువ్వు పెళ్ళిచేసుకో.

"క్షమించు. యిప్పుడు నీ సలహా వినలేను" అంటూ శ్రీహరి అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

తర్వాత ఒక వారం రోజులలో శ్రీహరి మరొక ఆఫీసుకు బదిలీ అయ్యాడు. తరుచు మేము కలుసుకోడానికి అవకాశాలు లేకపోయాయి. ఎప్పుడైనా నెళ్ళాళ్ళకు రెండు నెలలకు ఒకసారి కలుసుకోవడం తటస్థించేది.

ఒకరోజు శ్రీహరి హుస్సేనుసాగర్ ఫుట్‌పాత్ మీద కర్రకుర్చీలో కాలు సాచుకొని కూనిరాగాలు తీస్తున్నాడు. గడ్డం మాసింది. జుట్టు రేగిపోయి ఉంది. బట్టలు మాసిపోయి మకిలిగా వున్నాయి. కాలుకు తెగిపోయిన చెప్పులు తొడుగు కున్నాడు. నేను షికారుకు పోతూ ఆ వైపుకు వెళ్ళాను. అతన్ని చూచి పలకరించాను.

"కులాసాగా వున్నావా శ్రీహరి ?"

"చూస్తే తెలియటంలేదూ ?"

"మనోవేదన తగ్గలేదనుకుంటాను"

"తగ్గి చాలా రోజులయిపోయింది".

" ఏం ? "

" ఆమె నాలాంటి బ్రాహ్మచారిని మరొకరిని చూచుకుంది"

"మరి ఇంకెందుకీబాధ ? "

"అందుకే బోగంకొంపలకు పోయాను"

"ఆరోగ్యం చెడిపోలేదనుకుంటాను"

" చెడినా సంతోషించెడివాడిని. చెడనందున చాలా విచారిస్తున్నాను."

"ఇంకా అదృష్టవంతుడివి."

" అదృష్టం ఏనాడో పోయింది. కుమిలి కుళ్ళి పేడ పురుగులా బతకడం యింతకన్నా మంచిదేమో"

" పదిమంది మగవాళ్ళతో శృంగారం చేసె ఆడదాని కోసం ఎందుకు పరితపిస్తావు"

"భోగందానికన్న నయమేగా ?"

"పోలికలు పెట్టుకుంటే ప్రతి వస్తువు ఏదో విధంగా నయముగానే వుంటుంది."

"ఇప్పుడు ఆమెమీద అప్యాయత లేదు. అనురాగం లేదు. నా కోరిక తృణీకరించడంవల్ల బాధలేదు. కాని ప్రతి ఆడదాన్ని అనుభవించాలని వుంది. అందుకే ఆమె నాకు కావాలి."

"నువ్వు నీతి నియమాలు ఉల్లంఘిస్తున్నావు శ్రీహరి."

"నీకన్న నాకు నీతులు ఎక్కువ తెలుసును. నీతి నియమాలు మానవుడు అవసరాన్ననుసరించి నిర్ణయించుకుంటాడు" అంటూ శ్రీహరి కోపంగా చరచరా వెళ్ళిపోయాడు, నన్ను ఒంటరిగా వదిలేసి.

ఒకరోజు రాత్రి రెండవ ఆట సినీమాచూసి వస్తున్నాను. దారిలో కల్లుదుకాణాలు దాటి నడవాలి, పాటలు పాడుతూ తూలుతూ యిద్దరు వ్యక్తులు రోడ్డుమీద కనుపించారు. దగ్గరికి వెళ్ళి చూశాను. శ్రీహరి, ఒక స్త్రీ వారిద్దరు.

శ్రీహరి బుజంమీద చెయ్యివేశాను.

"ఎవడవురా నువ్వు ?" తూలుతూ అన్నాడు.

" నేను "

"పోవోయి నీదారిని పో. రావే" అంటూ ప్రక్కనున్న అడదాన్ని చెయ్యిపుచ్చుకు లాగాడు.

"శ్రీహరి యీ వేళ మా యింటికి వచ్చి పడుకో."

"పోరా మీా యింటికి వచ్చేఖర్మం నా కెందుకు. నాకు యిది వుందిగా. రావే. అబ్బాయి! ఆడది మగవాడు అనుభ విస్తూంటే అడ్డురావడం మహా పాపం" అంటూ తూలుతూ గెంటుతూ ఆమె చెయ్యిపుచ్చుకుని నడిచిపోతున్నాడు. కల్లు గిడ్డంగులవద్ద కొద్ది త్రాగుబోతువాళ్ళు తప్ప యింక ఎవ్వరూ లేరు ఆ ప్రాంతాలలో. శ్రీహరిని యీా పరిస్థితిలో సముదా యించడం చాలా కష్టమనిపించింది నాకు.

అతనిపై సానుభూతి చూపించగలగడం తప్ప, ఆ పరిస్థితిలో అతనికి ఏ విధమైన సహాయం చేయలేకపోయాను.

మరొక వారంరోజుల తరువాత విన్నవార్త. అతను ఆఫీసుకువస్తూ, కారుకిందపడి, గాయాలు తగిలి, ఆసుపత్రిలో చేర్చగా, ప్రాణాలు వదిలేశాడని విన్నాను.

శ్రీహరి ఉద్రేకాలు ఆపుకోలేక ఒడుదుడుకులతో జీవితం విషాదాంతం చేసుకున్నాడు. కాని అతని జీవితం నాకు చాలా విలువైనది.

"కడుపు నింపుకుని, కాళ్ళుసాచుకుని కాలం గడుపుకునే వ్యక్తుల జీవితాలు హృదయాలను స్పందించవు. పరిస్థితులకు పరిణామాలివ్వవు. శ్రీహరి దానికి వ్యతిరేకి. నన్ను కదిలించి పోయాడు."

అందుకే యీా కథ. కథతోపాటు ఒక కన్నీటిచుక్క.